www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 2 జూన్ 2025

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఉదయం 10 గంటల నుండి అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, వారి అర్జీల నమోదు, నమోదైన అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్‌ను సంప్రదించగలరని పేర్కొన్నారు

పారదర్శకంగా రేషన్ పంపిణీ

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని 1123 చౌక ధరల దుకాణాల ద్వారా అత్యంత పారదర్శకంగా రేషన్ పంపిణీ జరగాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ మాసం నుండి చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ, 65 సంవత్సరాల పైబడిన వారికి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ జరగనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం రాయచోటిలో రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. చెన్నముక్కపల్లి (షాప్ నెంబర్ 31), రెడ్డివారిపల్లి (షాప్ నెంబర్ 1)లలో రేషన్ పంపిణీని పునఃప్రారంభించి, పలువురు లబ్ధిదారులకు రేషన్ అందించారు. అనంతరం 65 సంవత్సరాల పైబడిన వారికి ఇంటి వద్దనే రేషన్ అందేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, రెడ్డివారిపల్లికి చెందిన రాజారెడ్డి, చెన్నముక్కపల్లెకు చెందిన వెంకటరెడ్డి, చెన్నముక్కపల్లెకు చెందిన దుగ్గిరెడ్డిలకు వారి ఇంటి వద్దనే స్వయంగా 10 కిలోల బియ్యం, అర కిలో చక్కెర రేషన్ పంపిణీ చేసి వారితో వివిధ విషయాలు మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1123 చౌక ధరల దుకాణాలు ఉన్నాయని తెలిపారు. రేషన్ కార్డులు 4,97,969 ఉన్నాయన్నారు. రేషన్ కార్డుల ద్వారా 14,82,094 మంది సభ్యులు రేషన్ ద్వారా లబ్ది పొందనున్నారని పేర్కొన్నారు. 65 సంవత్సరాల పైబడిన కార్డుల సంఖ్య 53,707గా ఉందని, ఈ కార్డుల ద్వారా 69,336 మంది సభ్యులు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటి నుండి 15వ తేదీ వరకు ఉదయం 8 నుండి 12 గంటల వరకు సాయంత్రం 4

వృద్ధుడికి రేషన్ అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

నుండి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఏక లేదా ద్విసభ్య కార్డులలోని వారి వయస్సు 65 ఏళ్లు పైబడి వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. చౌక ధరల దుకాణాల ద్వారా బలవర్ధకమైన బియ్యం, చెక్కర, కొన్ని దుకాణాల నందు జొన్నలు కూడా అందుబాటులో ఉన్నాయని, బియ్యము మరియు జొన్నలు పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డుదారులకు చెక్కర అరకిలో రూ.17కు, అంత్యోదయ కార్డుదారులకు చెక్కర ఒకకిలో రూ.13.50కు లభిస్తుందని, కార్డుదారులు తప్పక రసీదు పొందవలెనని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : 'ముక్కా'

మామిడి కాయలను తూకం వేస్తున్న రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని మామిడి ప్రయివేట్ మార్కెట్ యార్డు ప్రాంగణాన్ని ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్ సందర్శించారు. అనంతరం మామిడి రైతుల సమావేశం నిర్వహించారు. రైతుల సమక్షంలో మామిడికి గిట్టుబాటు ధర కల్పించేలా వెంటనే పరిష్కారం చూపాలని కలెక్టర్‌తో ద్వారా కలెక్టర్ స్పందిస్తూ ఒక సంపూర్ణ నివేదికను తీసుకొస్తే మినిమం స్టాండర్డ్ రేట్ పది రూపాయలు తగ్గకుండా ఉండేటట్లు చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రతి మామిడి మండి వ్యాపారస్తుడితో ముఖాముఖి ముక్కా రూపానందరెడ్డి మామిడి రైతుల సాధక బాధకాలు తెలుసుకున్నారు. పంట నష్టాలు, గిట్టుబాటు ధరల సమస్యల గురించి అడిగి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను తీర్చేందుకు కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందనీ, రైతులకు న్యాయం జరిగేలా కలెక్టర్‌కు ఒక నివేదిక ఇస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రైతుల పక్షాన నిలబడటం మా బాధ్యత అన్నారు. మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ధరల స్థిరీకరణ కోసం చర్యలు చేపడతామని, రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. రైతులకు ఆర్థికంగా, వ్యవసాయ విధానాల్లో బలమిచ్చేలా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రణాళికలను సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువనాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రైతులు, మామిడి మండీల యజమానులు, కూటమి నాయుకులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

4న వెన్నుపోటు దినం : వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడానికే వైసిపి అధినాయకత్వం ఆదేశాల మేరకు జూన్ 4న వెన్నుపోటు దినోత్సవాన్ని రాష్ట్రమంతా జరుపుకోవాలని నిర్ణయించినట్లు వైసిపి మదనపల్లె సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. వైసిపి కార్యాలయంలో వెన్నుపోటు దినోత్సవ పోస్టర్ల ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏడాది కాలంలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకుండా అన్నివర్గాల ప్రజలను వెన్నుపోటు పొడిచిందని విమర్శలు గుప్పించారు. ఉద్యోగస్తులకు టిఎ, డిఎ, పిఆర్‌సి ఇవ్వలేదన్నారు. రైతుల పరిస్థితి మరి దయనీ యంగా ఉందన్నారు. ముఖ్యంగా మదనపల్లె ప్రాంతంలో టమోటా రైతుల దుస్థితి దారుణంగా ఉందని, ధరలు పతనం కావడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాదయాత్ర సందర్భంగా లోకేష్ టమోటా రైతుల కోసం టమోటా ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 4న స్థానిక చిత్తూరు బస్టాండ్ నుంచి శాంతియుత ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి వైసిపి శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మనూజారెడ్డి, జడ్‌పిటిసి ఉదయ్‌కుమార్, లియాఖత్ అలీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తేక్వాండోలో సత్తా చాటిన 'ఏకలవ్య' విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆంధ్రప్రదేశ్ తేక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు చైతన్యకుమార్ ఆధ్వర్యంలో గుంటూరులోని టిటి తేక్వాండో అకాడమీలో ఆదివారం జరిగిన బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో రాజంపేటకు చెందిన ఏకలవ్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారు. మొత్తం ఆరుగురు క్రీడాకారులు ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో సత్తాచాటినట్లు మాస్టర్ ఆర్.ఎన్.రెడ్డి ప్రవీణ్, యు.బాలాజీ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దండపు బాలాజీ గణేష్ బ్లాక్ బెల్ట్ డాన్-2, డి.సహస్వి, జి.దేదీప్య, జి.సుస్వరశ్రీ, కె.ఎల్ భరణి, ఎం.కౌశల్ కుమార్ రావు బ్లాక్ బెల్ట్ డాన్-1లో ప్రతిభ చాటారని అన్నారు. క్రీడాకారులు చైతన్యకుమార్ నుంచి బ్లాక్ బెల్ట్ తో పాటు సర్టిఫికెట్లు అందుకున్నట్లు తెలిపారు. తేక్వాండో సాధన వలన ఆత్మ రక్షణతో పాటు మెండైన ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం సొంతమవుతుందని తెలిపారు. తమ అకాడమీలో ఆత్మ రక్షణకు చక్కటి మెలుకువులు నేర్పుతామని వివరించారు.

సర్టిఫికెట్ అందుకుంటున్న క్రీడాకారులు

మెగా డిఎస్‌సి పరీక్ష విధానం మార్చాలి : బిఎస్‌వై

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మెగా డిఎస్‌సి పేరిట ఐదున్నర లక్షల మంది జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటోందని, ఒక ప్రక్రియ, ఒక విధానం, ఒక స్పష్టత లేకుండా అభ్యర్థులకు అన్యాయం జరిగేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే మేల్కొని అత్యున్నత స్థాయిలో నిర్ణయం, సమీక్ష చేసి అభ్యర్థులకు అనుకూలమైన నిర్ణయం తీసుకుని లక్షలాది మంది అభ్యర్థుల జీవితాలు కాపాడాలని కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిఎస్‌సి పరీక్షను 90 రోజులు వాయిదా వేయాలన్నారు. అభ్యర్థులకు దరఖాస్తు చేసుకోడానికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందించి, అంతా సిద్ధమయ్యే సరికి పది రోజులు వృధా అయ్యిందని, ఇంత ఒత్తిడి మధ్య అభ్యర్థులు సరిగ్గా పరీక్ష రాయలేరు కాబట్టి పరీక్షను 90 రోజులు వాయిదా వేయాలన్నారు. నార్మలైజేషన్ పద్ధతిని రద్దు చేసి, ఒక జిల్లాకు ఒకేసారి, ఒకే విధమైన పేపర్ (ప్రశ్నపత్రం)తో పరీక్షనిర్వహించాలని కోరారు. అభ్యర్థులకు వయో పరిమితి పెంచి, తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా ఆంధ్రప్రదేశ్ లో కూడా 47 ఏళ్ల వయసుని అర్హతగా నిర్ణయించాలన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థుల భవితను దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. రెండు ప్రభుత్వాల తప్పులకు, ఈ నిబంధనలకు నిరుద్యోగుల జీవి తాలు అన్యాయం అయిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాకు అన్ని విద్యార్థి, నిరుద్యోగ, బహుజన సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే లక్ష్యం

- డిఎస్‌సి ఉచిత శిక్షణ ముగింపు సభలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం ఈ నెల ఆరవ తేదీ నుంచి నిర్వహించే డిఎస్‌సి ఉపాధ్యాయ పోస్టులు సాధించాలంటే మరింత కష్టపడాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్ పాలెం మహేష్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో 40 రోజులపాటు డిఎస్‌సి ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 24 నుంచి డిఎస్‌సి అభ్యర్థులకు ఎస్‌జిటిలో ఉచిత శిక్షణను యుటిఎఫ్ ఇచ్చిందని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విద్య కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యుటిఎఫ్ శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకుండా చేసి పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే ప్రయత్నాలు ప్రస్తుత ప్రభుత్వాలు చేస్తున్నాయని హెచ్చరించారు. విద్యను అందించే బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించలేదని తెలిపారు. కారణాలు ఏమైనా ప్రస్తుత కూటమి ప్రభుత్వం డిఎస్సీ నిర్వహిస్తూ ఉందని చెప్పారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవడం కోసం, నవతరంలో చైతన్య స్ఫూర్తిని నింపేందుకు యుటిఎఫ్ ఈ ఉచిత కోచింగ్ నిర్వహించిందని పేర్కొన్నారు. వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణ ఇచ్చే నిష్ణాతులైన ఫ్యాకల్టీతో ఇక్కడ ఉచిత శిక్షణ ఇప్పించామని తెలిపారు. సహకరించిన వీరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయ పోస్టులు సాధించాలని తాము కోరుకుంటున్నామన్నారు. మీరంతా ఉపాధ్యాయులు అయ్యాక యుటిఎఫ్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధ్యాయ పోస్టులు సాధించాలని, రాకపోయినా నిరుత్సాహ పడవద్దని చెప్పారు. ఉద్యోగం సాధించేవరకు నిరంతర

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంతోమంది ప్రయివేట్ విద్యా సంస్థలు నెల కొల్పి కోట్ల రూపాయలు ఆర్జించిన వారు ఉన్నారని పేర్కొన్నారు. మనపై మనకు నమ్మకం ఉంటే ఏదైనా సాధించవచ్చు అని తెలిపారు. ఉచిత కోచింగ్‌కు ఆధ్యుడైన ప్రసాద్‌రెడ్డిని అభినందించారు. డిఎస్‌సి పరీక్ష రాసేటప్పుడు ఎలాంటి తడ పాటు పడవద్దని చెప్పారు. జిల్లాలో అనుకున్న స్థాయిలో కోచింగ్ సెంటర్లు లేవని, దీనిని దృష్టిలో పెట్టుకుని యుటిఎఫ్ ఉచిత కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. భవిష్యత్తు ఉపాధ్యాయులను యుటిఎఫ్ తయారు చేయాలని ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. సమిష్టి కృషితో 40 రోజులపాటు నిర్వహించిన శిక్షణ విజయవంతమైందని తెలిపారు. మరింత కష్టపడితే మీ శ్రమ వృధా కాదని చెప్పారు. యుటిఎఫ్ సహా అధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి యజాజ్ అహ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్ మాట్లాడుతూ ఉచిత శిక్షణ సాధ్యమవుతుందా అన్న సందేహంతో ముందడుగు వేశామని పేర్కొన్నారు. చివరికి అభ్యర్థులకు తమ శక్తి మేర శిక్షణ ఇచ్చినట్లు తాము భావిస్తున్నామని తెలిపారు. పరీక్ష ప్రారంభమయ్యే వరకు గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తూ ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు నరసింహారావు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులాచారి, అభయ్, అనిల్ కుమార్, నరసింహులు, ప్రకాష్, బాష, గౌస్ పీర్, శిక్షణ తీసుకున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరం

- జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.గౌస్‌బాషా

ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

యువతీ, యువకులకు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.గౌస్‌బాషా పేర్కొన్నారు. జిల్లాలో క్రీడలతో యువత, యువకులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. జిల్లాలో అందుబాటులో ఉండి ప్రభుత్వం అందిస్తున్న క్రీడలను ప్రోత్సహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా స్టేడియాలు, స్పోర్ట్స్ అధికారులు పని వివరాలు, ప్రస్తుతం క్రీడా పోటీలు ఎక్కడ జరుగుతున్నాయో, ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాలు వంటివి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో స్టేడియాలు ఉన్నాయి?

జిల్లాలో మూడు ప్రధాన స్టేడియాలు ఉన్నాయి. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి అబ్బవరం గ్రామంలో నక్కవాండ్లపల్లె వద్ద 24 ఎకరాలలో క్రికెట్ స్టేడియం ఉంది.

స్పోర్ట్స్ అధికారుల పనివివరాలు తెలపండి?

జిల్లాలో యువతీ, యువకులకు అందుబాటులో ఉండి అన్ని రకాల క్రీడలకు సంబంధించి సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా టోర్నమెంట్ జరుగతుంటే వాటిని పర్యవేక్షించడం క్రీడలలో యువతీ, యువకులు క్రీడలు ఆడే వారిని గుర్తించడం వారిని రాష్ట్ర స్థాయిలో జరిగే కార్యక్రమాలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

జిల్లాలో ఎలాంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

జిల్లాలో క్రీడాలే అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం. సమ్మర్ కోచింగ్ క్యాంపులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. ఈ శిబిరాల్లో విద్యార్థులకు బహుళ క్రీడా విభాగాల్లో శిక్షణ కూడా ఉంటుంది.

క్రీడలకు ఎలాంటి సహకారం అందిస్తోంది?

ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ పాలసీ ప్రకారం స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగా వకాశాలు కల్పిస్తున్నాం. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్ఎఎపి) స్పోర్ట్స్ కేలండర్‌ను సిద్ధం చేస్తున్నాం. జిల్లా అధికారులతో సమన్వయంతో షెడ్యూల్ చేస్తాం.

క్రీడా పోటీలు ఎక్కడ నిర్వహిస్తున్నారు?

సమ్మర్ కోచింగ్ క్యాంపుల సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాం. జిల్లాలోని 17 వివిధ క్రీడా విభాగాల్లో స్పోర్ట్స్ కిట్‌లు, మెటీరియల్స్‌ను పంపిణీ చేశాం.

ప్రభుత్వం ఏదైనా స్పోర్ట్స్ కిట్‌లను అందజేస్తోందా?

వేసవి శిబిరాల సందర్భంగా స్పోర్ట్స్ కిట్‌లు జారీ చేశాం. యువ క్రీడాకారులకు మద్దతుగా 17 విభాగాలకు సంబంధించిన పరికరాలు అందించాం.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లాలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ (డిఎస్ఎ) కోచ్‌ల అవసరం ఉంది.

యువతకు మీరు ఎలాంటి సలహాలు, సూచనలు ఇస్తారు?

ఆటగాళ్ల శారీరక శ్రేయస్సును కాపాడు కోవడానికి ఆరోగ్యం, ఫిట్‌నెస్ మార్గదర్శకాలు జారీ చేశాం. శారీరక శిక్షణ, క్రీడలలో క్రమం తప్పకుండా పాల్గొనాలి. క్రమశిక్షణ, స్థిరత్వం, ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్వహించండి. ప్రభుత్వం కల్పిస్తున్న టువంటి శిక్షణ అవకాశాలను యువతీ, యువకులు సద్వినియం చేసుకోవాలి.

జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా పెంచలయ్య బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - కడప సిటీ : జిల్లా సర్వజన ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ (ఎఫ్ఎసి) బాధ్యతలను ఆదివారం డెర్మటాలజీ హెచ్‌ఒడి డాక్టర్ పెంచలయ్య స్వీక రించారు. రిటైర్డు సూపరింటెండెంట్ జి.వి.రమాదేవి శనివారం రిటైరైన సంగతి తెలిసిందే. ఆమె పెంచలయ్యకు బాధ్యతలను అప్పగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ జిజిహెచ్ పాలనా బాధ్యతలను సమర్థవం తంగా నిర్వర్తించడానికి శాయ శక్తులా కృషి చేస్తానని తెలిపారు. ప్రతిరోజూ వార్డులను, వైద్య విభాగాలను రౌండ్ల వారీగా పరిశీలిస్తానని తెలిపారు.

నేడు ఎంసి చైర్మన్‌గా రామమూర్తి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పురం రామమూర్తి, డైరెక్టర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తెలుగు దేశం పార్టీలోనే మంచి గుర్తింపు సాధ్యమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నరని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ మంచి గుర్తింపు ఉంటుందనడానికి నామినేటెడ్ పదవుల పంపిణీనే ఓ నిదర్శనమని గుర్తు చేశారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి కూడా కార్యకర్తల సేవలను గుర్తించి వారికి ప్రత్యేక గుర్తింపు, అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తాను, మరో 14 మంది డైరెక్టర్లు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి నేతృత్వంలో ప్రమాణ స్వీకారం చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, ఇతర నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బద్వేలు

వడ్డెరుల కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆ సంఘ ఎపి వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో డేరంగుల వెంకటేష్ అధ్యక్షతన బద్వేల్ నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ జూన్ చివరి వారంలో నెల్లూరు నగరంలో జరుగు ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వడ్డెర వృత్తిదారులు, వడ్డెరలు అందరూ ఐక్యంగా, ఒకే మాట, ఒకే తాటిపై ఉండి సమస్యలపై పనిచేసి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. సంఘాన్ని బద్వేల్ టౌన్‌లోనూ నియోజకవర్గంలోనూ జిల్లాలో బలోపేతం చేయాలని కోరినారు. వడ్డెర కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించి కార్పొరేషన్ విధి విధానాల ప్రకటించి కార్పొరేషన్ ద్వారా వడ్డెర్లకు 90 శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలను అందించి వృత్తిదారుల సంక్షేమానికి తోడ్పడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వడ్డెర మహిళలపై చిన్నారులపై వడ్డెర్లపై వృత్తిదారులపై భూస్వాములు పెత్తందార్లు, అల్లరి మూక అత్యాచారాలు, అగత్యాలు, దౌర్జన్యాలు హత్యలు చేస్తున్నారని వీటిని అరికట్టడానికి ఎస్‌సి, ఎస్‌టిల మాదిరిగా అట్రాసిటీ ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకొని వచ్చి వడ్డెర్లకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని ప్రభుత్వాలను డిమాండ్ చేసినారు. కమిటీ కన్వీనర్‌గా బత్తుల గంగయ్య, కో-కన్వీనర్లుగా టి.సుబ్బయ్య, దేవల్ల వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా జి.సుబ్బమ్మ, జి.సుబ్బరాయుడు, రమణ పాల్గొన్నారు.

నెల్లూరు, కడప జట్ల ఘన విజయం

ప్రజాశక్తి - కడప : సౌత్‌జోన్ ఎసిఎ అండర్-23 వన్డే క్రికెట్ టోర్నీలో ఆదివారం కడప జరిగిన మ్యాచుల్లో నెల్లూరు, కడప జట్లు ఘన విజయం సాధించాయి. కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభ రోజు అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 49.0 ఓవర్లలో 230 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కె.హెచ్.వీరారెడ్డి 47, పి.వికాస్ 42 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని ఎన్.భార్గవ్ 4, ఎస్.అఖిల్ సాలుంకే 3, ఎన్.మాధవ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 231 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 36.1 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని జి.మన్విత్ రెడ్డి అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి సెంచరీ చేశారు. 77 బంతులను ఎదుర్కొని 8 బావుండారీలు, 8 బౌండరీ సిక్సుల సహాయంతో 109 పరుగులు చేశాడు. ఎస్.ఆతిక్ సల్మాన్ 33 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని జి.మల్లికార్జున 2, ఎం.దీపక్ 2, షేక్ కామిల్ 2 వికెట్లు తీసుకున్నారు.

ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన ప్రారంభమైన మ్యాచ్‌లో కడప జట్టు 21 పరుగుల తేడాతో కర్నూలు జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 45.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. ఆ జట్టులోని

తలపడుతున్న కడప, కర్నూలు జట్లు

ఎం.వాసుదేవరాజు 99, సి.విజయ్ రామ్‌రెడ్డి 61 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని పి.సబ్జాన్ భాష అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. సూర్య తేజరెడ్డి 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 237 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన కర్నూలు జట్టు 45.0 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని టి.తౌఫిక్ హుస్సేన్ 41, మనోజ్ రాజు 66 పరుగులు చేశారు. కడప జట్టులోని షేక్ ఆదిల్ హుస్సేన్ 4 వికెట్లు తీసుకున్నాడు.

మన్విత్‌రెడ్డి (109 పరుగులు)

వాసుదేవరాజు (99 పరుగులు)

సాబ్జాన్‌బాషా (5 వికెట్లు)

ఆదిల్ (4 వికెట్లు)

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

కూలీలపై తేనెటీగలు దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూలీలపై తేనెటీగలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని పొన్నేటిపాలెంకు సమీపంలో రామిరెడ్డిగారిపల్లికి చెందిన శంకర్ రెడ్డి, శాంతమ్మ, దివాకర్‌రెడ్డి మరో ముగ్గురు కలిసి పొలంలో టమోటాలు కోసేందుకు కూలికి వెళ్లారు. పనుల్లో నిమగ్నమై ఉండగా చెట్లపొదల్లో ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా వారిపై దాడిచేశాయి. ఈ దాడిలో శంకర్‌రెడ్డి, శాంతమ్మ, దివాకర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్సలు అందించడంతో కోలుకుంటున్నారు.

ఖాదర్‌బాషా మృతి బాధాకరం

ప్రజాశక్తి-రాయచోటి

టిడిపి నాయకులు ఖాదర్‌బాషా మృతి చెందడం చాలా బాధాకరమని టిడిపి నాయకులు మౌర్యా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం టిడిపి నాయకులు మండలం లోని కాటిమాయకుంట గ్రామ పంచాయతీ, గుంటిమడుగు గ్రామంలో ఖాదర్‌బాషా మృతదేహానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాదర్ బాషా పార్టీ కార్యకలాపాలల్లో చురుకుగా పాల్గొనేవారిని ఆయన మృతి చెందడం పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండభాస్కర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-పుల్లంపేట

విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ముక్కా వరలక్ష్మి

ఓబులవారిపల్లి మండల పరిధిలోని బొమ్మవరం గ్రామంలో ఆదివారం వక్రతుండ వినాయక స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి హాజరై శ్రీ సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అర్చకుల, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కల్యాణం అనంతరం న్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు , కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వ ర్యంలో వసంతపేట మున్సి పల్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర 2047 అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి బహుమతి శ్రీ రవీంద్ర హైస్కూల్‌కు చెందిన శ్రీనిధి, రెండవ బహుమతి ఎంపీపీ స్కూల్ లక్ష్మీ భవ్య, మూడవ బహుమతి వసం తపేట మున్సిపల్ హై స్కూల్‌కు చెందిన లక్ష్మణ్ అందుకున్నారు. ముఖ్య అతిథిగా వసంతపేట మున్సిపల్ హైస్కూల్ ప్రధానో పాధ్యాయులు గురప్ప పాల్గొన్నారు. సమ్మర్ క్యాంప్ ముగింపు రోజున బహు మతులు అందజేస్తామని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం తెలిపారు.

నేటి నుంచి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ : జెవివి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎపి హైకోర్టు, బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్ఆర్బి, గ్రూప్ డి, ఎన్‌టిపిసి ఉద్యోగాలకు ఉచిత కోచింగ్‌ను సోమవారం నుంచి ఇవ్వనున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జెవివి ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య తెలిపారు. ఆ మేరకు వారు జెవివి కార్యాలయంలో గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఉచిత శిక్షణకు రాదలచిన వారు 97053 33305కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు.

రైతుబజార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వేంపల్లె - వేంపల్లె

రైతుబజార్‌ను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు కోరారు. స్థానిక రైతుబజార్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన కూరగాయలను విక్రయించుకొనేందుకు గత వైసిపి ప్రభుత్వం పాలనలో రూ.1.20 కోట్లతో రైతుబజార్‌ను నిర్మించారన్నారు. ప్రజలందరూ రైతుబజార్‌లో ఉన్న తాజా కూరగాయలను కొనుగోలు చేయాలని కోరారు. మౌలిక సదుపాయాలు కూడా కల్పించామన్నారు. రైతు బజారు వినియోగంలోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, వైసిపి నేత కసిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, దొంతు సుమన్, చంద్ర, వెంకట రమణారెడ్డి, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - తొండూరు

తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993-95 బ్యాచ్ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారు తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆత్మీయంగా ముచ్చటించుకొని, తమ విద్యా జీవితంలోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పలువురు విద్యార్థులు తమ జీవితాల్లో పాఠశాల ప్రభావాన్ని వివరిస్తూ భావోద్వేగ ప్రసంగాలు చేశారు. పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో తమ వంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

అదరగొట్టిన అఖిల్ డాన్స్ అకాడమీ చిన్నారులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప శిల్పారామం సాంస్కృతిక కళా వేదిక పైన డ్రీమ్ మీడియా సుజాత వారి సహకారంతో కడప నగరానికి చెందిన అఖిల్ డాన్స్ అకాడమీ శాస్త్రీయ నృత్యాలు, పల్లె జానపదాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను అలరించినాయి. గొబ్బియాలో..గొబ్బియాలో.. రాను రాను బొంబాయికి.. వన్నెలాడే టిక్కులాడే చిన్నారులు నృత్యం చేశారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రజా పంపిణీ వ్యవస్థతోనే ప్రజలకు మేలు

రైల్వేకోడూరు : రేషన్ పంపిణీని ప్రారంభిస్తున్న జెసి ఆదర్శరాజేంద్రన్

రాజంపేట : చౌక దుకాణాన్ని ప్రారంభిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, టిడిపి కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ పునః ప్రారంభించారు. మండలంలోని వివిఆర్ కండ్రిక గ్రామంలో రేషన్ షాపులో వారు రేషన్ కంపెనీ కార్యక్రమాన్ని చేపట్టారు.రేషన్ షాపులకు రాలేని వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్ద రేషన్ అందజేయాలని డీలర్లకు తెలియజేశారు.ఈ సందర్భంగా ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. రేషన్ సరఫరాను మరింత సులభతరం చేసేందుకు షాపుల వద్దనే రేషన్ పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. రేషన్ కోసం ఎవరూ పనులు మానుకోకుండా తమకు వీలున్న సమయంలో రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు.రేషన్ షాపులకు రాలేని వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్ద రేషన్ అందించాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్ చాంద్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మెరుగైన ప్రజా పంపిణీ వ్యవస్థతో ప్రజలకు మేలు జరుగుతుందని, అందుకే కూటమి ప్రభుత్వం తిరిగి చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభించిందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని హస్తవరం చెర్లోపల్లి, వై.బి.యన్ పల్లి, నూనెవారిపల్లి, అమ్మవారిశాల, రాజీవ్ నగర్, మన్నూరు తదితర ప్రాంతాలలో చౌక దుకాణాలను అధికారులు, కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ అంటే ప్రజలకు అనుకూలంగా ఉండాలని, అలా కాకుండా గత ప్రభుత్వం ప్రచార యావతో కోట్లాది రూపాయలను ఖర్చుపెట్టి ప్రచార వాహనాలుగా ప్రజా పంపిణీ వ్యవస్థను వినియోగించుకుని అటు ప్రజలకు, ఇటు ఖజానాకు పంగనామాలు పెట్టిందని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పంపిణీ వ్యవస్థలో నెలలో 15 రోజులు రేషన్ అందుబాటులో ఉంటుందని అన్నారు. ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా రేషన్ అందిస్తారని తెలిపారు. ప్రజలకు వీలున్న సమయాల్లో రేషన్ అందుకోవచ్చని తెలిపారు. పాలన అంటే ప్రజలకు సేవ చేయడమని, ప్రచారంతో ఖజానాకు చిల్లు పెట్టడం కాదని ఆయన గత ప్రభుత్వానికి చురకలు అంటించారు. కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** చౌకదుకాణాల డీలర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత చేరువతో సరుకులను పంపిణీ చేయవచ్చని మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష అన్నారు. చౌక దుకాణాల ద్వారానే సరుకులను ప్రజలకు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఆ మేరకు మండలంలోని రాచవేటి వారిపల్లి గ్రామం వడ్డిపల్లిలోని చౌక దుకాణం 23ను రాజంపేట పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె వెంకటేష్, సర్పంచ్ సుబ్రమ ణ్యం, తహశీల్దార్ అమర్నాథ్‌తో కలసి ప్రారంభించారు. లబ్ధిదారులకు సరుకు లను పంపిణీ చేశారు. కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజీగారిపల్లెలోని చౌక దుకాణం 15 ను జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యులు సుధాకర్‌రావు, నాయకులు జగదీష్, రఫీ, డీలర్ మల్లేశ్వరరావు, విఆర్ఒ శ్రీనివాసులతో కలిసి ప్రారంభించి సరుకులను పంపిణీ చేశారు. మండలంలో 25 చౌక దుకాణాలు ఉండగా,10,388 రేషన్ కార్డులు ఉన్నా యన్నారు. కార్యక్ర మంలో జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యులు సుధాకర్‌రావు, జగదీష్, డీలర్ల సంఘం మండల ఉపాధ్యక్షులు మల్లేశ్వరరావు, రఫీ, చంద్ర, రెడ్డప్ప, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి:** మండలంలో అన్ని రేషన్ షాపుల వద్ద టిడిపి నాయకులు ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న 8వ షాప్ వద్ద మండల టిడిపి అధ్యక్షులు నిజాముద్దీన్ , తహశీల్దార్ మహే శ్వరి బాయ్ ఆధ్వర్యంలో పేదలకు బియ్యం పంపిణీ చేశారు. గుట్టపాలెం పంచాయతీ లోని గుట్ట పాలెంకాస్పా, ఎల్లంపల్లి, దిగువ ఖమ్మంవారిపల్లి, జంగంపల్లి, వాడవాం డ్లపల్లిలో మాజీ సర్పంచ్ కే.వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపిటిసి జితేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో రేషన్ షాపులు ప్రారంభించి పేదలకు బియ్యం పంపిణీ చేశారు. మర్రి కుంట పల్లిలో సర్పంచ్ రెడ్డి రామ్ ఆధ్వర్యంలో, మేడి గుర్తు పంచాయతీలు మాజీ ఎంపీటీసీ జనార్దన్ గౌడ్ ఆధ్వర్యంలో, పతేగడలో టిడిపి రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు చంద్ర ఆధ్వర్యంలో రేషన్ షాపులు ప్రారంభించి ఉచిత బియ్యాన్ని అర్హులైన పేదలకు అందించారు. కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి దినకర్ సనావుల్లా, టిడిపి నాయకులు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడ 24వ ఎఫ్‌పి దుకాణంలో టిడిపి మండల అధ్యక్షులు ప్రభాకర్‌నాయుడు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మరల సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 8 గంటల వరకు డీలర్లు విధిగా చౌక దుకాణాలలో ఉండి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించినట్లు తెలిపారు. **సుండుపల్లి:** మండల కేంద్రంలో అఫ్జల్ రేషన్‌దుకాణంలో తహశీల్దార్ దైవాదీనం రేషన్ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్, కూటమి నాయకులు మాట్లాడుతూ ఒషన్ షాపు డీలర్లు ప్రభుత్వా నియమ నిబంధనల ప్రకారం కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీకి సంబంధించి తూకంలో తేడాలు లేకుండా ఖచ్చితమైన తూకంతో బియ్యం ఇవ్వాలన్నారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలో 50 రేషన్ దుకాణాలు ఉండగా, రూరల్ మండల పరిధిలో 51 రేషన్ దుకాణాలు ఉన్నాయి. మొత్తం 101 రేషన్ షాపుల్లో సేవలు ప్రారంభమయ్యాయి. కొన్ని సాంకేతిక కారణా లవల్ల 10 షాపులు మినహా మిగతా షాపుల్లో రేషన్ బియ్యాన్ని సరఫరా చేపట్టారు. పలు ప్రాంతంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరై లబ్ధిదారులకు రేషన్ సరుకులను అందజేశారు. **బి.కొత్తకోట :** పట్టణంలోని 1వ నెంబర్ రేషన్ దుకాణాన్ని విఆర్ఒ శ్రీరాములు,టిడిపి నేత డేరంగుల నారాయణ, డీలర్ డేరంగుల నాగరాజు ప్రారంభించి కార్డుదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎండియు వాహనాలు వచ్చినప్పుడు ప్రజలు అందుబాటులో లేకపోవడం వల్ల రేషన్ తీసుకోవడానికి ఇబ్బంది పడేవారని, ఇప్పుడు వీలున్నప్పుడు దుకాణానికి తీసుకోవచ్చని అన్నారు. **పీలేరు:** పట్టణంలోని అయ్యప్పరెడ్డి కాలనీలోని 9వ నెబరు చౌక దుకాణంలో నిత్యావసర సరుకులను పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి, తెలుగుదేశం పార్టీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటపల్లి బాబురెడ్డి, మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, కోడి రామకృష్ణారెడ్డి, రెడ్డిబాషా, డిటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని రెడ్డిపల్లి షాప్ నెంబర్ 10లో రేషన్ దుకాణంలో సరుకులు పంపిణీ చేయడం జరిగింది. తహశీల్దార్ అరవింద్ కిషోర్, ఆర్ఐ సుశీల్‌కుమార్ పర్యవేక్షిం చారు. కార్యక్రమంలో విఆర్ఒ రాధమ్మ, డీలర్ మల్లీశ్వరి, రొంపిచర్ల మురళి పాల్గొన్నారు.

పిల్లలకు మనోవికాసం..వినోదాత్మక విజ్ఞానం

- వేసవి విజ్ఞాన తరగతులతో విద్యార్థుల్లో ఉత్సాహం
- గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకుంటున్న పాఠకులు

యోగా నేర్చుకుంటున్న చిన్నారులు

ప్రజాశక్తి-పీలేరు

పిల్లలకు సెలవులు అంటే చాలా ఇష్టం. అందులోనూ వేసవి సెలవులు అంటే మరీ ఇష్టం. విద్యాసంస్థలకు సెలవులు వస్తున్నాయంటే.. పిల్లల ఆనందానికి అవధులే ఉండవు. చిన్నారులు కొందరు సెలవుల్లో అమ్మమ్మ వాళ్ల ఊరికి వెళ్లాలనుకుంటారు. ఇంకొందరు నాయనమ్మ వాళ్ళ ఊరికి పోవాలనుకుంటారు. మరికొందరు కొత్త కొత్త ప్రదేశాల్లో విహారయాత్రలకు వెళ్లాలని ఆశపడతారు, ఆసక్తి చూపుతారు. అందుకోసం ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. ఏడాది పొడవునా బడికి బండెడు పుస్తకాల మోతను భరిస్తూ, బడిలో అయ్యవార్ల పాఠాలు, ఇంటా, బయటా చదువు.. చదువూ అంటూ పెద్దల మాటలు వినీ వినీ విసిగెత్తిన పిల్లల హృదయాలకు వేసవి సెలవులు ఎంతో ఉపశమనాన్ని అందిస్తాయి. చిన్నారులను సెల్ ఫోన్లు, టీవీల దగ్గర చేరడం వల్ల మానవ సంబంధాలకు దూరమై, మానసిక సమస్యలకు దగ్గరయ్యే ప్రమాదం ఉందంటూ మానసిక శాస్త్ర నిపుణులు హెచ్చరిస్తున్నారు. బాల్యాన్ని సెలవుల్లో చిత్రలేఖనం, వ్రాతను అభివృద్ధి పరచుకోవడం, కథలు వినడం, కథలు వల్లించడం వంటి సృజనాత్మకతలకు, వారికి కళలు, క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని వారు సూచిస్తున్నారు. అందుకోసం జిల్లా గ్రంథాలయ సంస్థ గ్రంథాలయాలు వేదికగా 'వేసవి విజ్ఞాన తరగతులు' పేరుతో పిల్లల కోసం ప్రత్యేక వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వ హిస్తోంది. పిల్లలకు మనో వికాసం, వినోదాత్మక విజ్ఞానం అందివ్వడం కోసం ఈ వేసవి సెలవుల్లో పీలేరు శాఖా గ్రంథాలయంలోనూ వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్లు శాఖా గ్రంథాలయ అధికారి ఆమరనాథ్ తెలిపారు. ఈ శిక్షణా శిబిరం ద్వారా చిన్నారులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, కథలు చెప్పడం, కథలు రాయడం, చెస్, క్యారమ్స్, శాస్త్రీయ సంగీతం, ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్ వంటి ప్రత్యేక అంశాల్లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో పెద్ద మొత్రంలో పీజులు వసూలు చేసి నేర్పే అనేక అంశాలను తాము ఆయా రంగాల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా ఉచితంగా బోధిస్తున్నామని, చిన్నారులు తమలో దాగున్న ప్రత్యేక ప్రతిభలను వెలికి తీసేందుకు ఈ వేసవి శిబిరం ఎంతో ఉపయోగపడుతోందని ఆయన అన్నారు. అంతేకాకుండా ఈ శిక్షణ ద్వారా విద్యార్థి జీవితంలో ఒత్తిడి చాలా వరకు తగ్గుతుందని తెలిపారు. జూన్ 6 వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించే జరిగే శిక్షణ కార్యక్రమాన్ని తమ పిల్లలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని గ్రంథాలయాధికారి కోరుతున్నారు.

గ్రంథాలయ సేవలను వినియోగించుకుంటున్న పాఠకులు

స్వర్ణోత్సవ వేడుకలకు హాజరైన పూర్వ విద్యార్థులు

ఘనంగా ప్రభుత్వ పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలు

-గురువులకు, ఉద్యోగ విరమణ పొందిన సైనికులకు సన్మానం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలను ఆ పాఠశాలలో చదివిన 1974 సంవత్సరం నుంచి 2024వ సంవత్సరం వరకు చదువుకున్న పూర్వపు విద్యార్థులంతా కలిసి పాఠశాల 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ స్వర్ణోత్సవ వేడుకలకు పూర్వపు విద్యార్థులు దాదాపు రెండు వేల మందికి పైగా కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణంలో జరిగిన ఈ స్వర్ణోత్సవ వేడుకలు ఉదయం 8 గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు పలు కార్యక్రమాలతో కొనసాగింది. ఉదయం జ్యోతి ప్రజ్వలనతో మొదలైన కార్యక్రమం పాఠశాలలో చదివి మరణించిన వారికి, ఉపాధ్యాయులకు, దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులు జవాన్లకు నివాళులర్పించి వారి ఆత్మ శాంతి కోసం మౌనం పాటించారు. ములకలచెరువు మండల కేంద్రంలో పాఠశాల ప్రారంభం కోసం పునాదివేసిన భాస్కర చలపతిని సన్మానించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు విద్యా బోధనలు చేసిన గురువులకు పూలమాలతో శాలువాల కప్పి మెమొంటోలు అందించి సన్మానించారు. ప్రతి ఏడాది పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న పాఠశాల పూర్వపు విద్యార్థి, ఆర్‌టిసి కండక్టర్ ములకలచెరువుకు చెందిన తోట శ్రీధర్ ను ఘనంగా సన్మానించారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ మార్కులు 577 సాధించిన ములకలచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులైన ఖ్యాతి శ్రీకి రూ. 70 వేలు, అదేవిధంగా 540 మార్కులు సాధించిన మీనాక్షి, మహమ్మద్ ఫహద్ లకు రూ. 40 వేల చొప్పున నగదు బహుమతిని తంబళ్లపల్లి టిడిపి ఇన్‌ఛార్జి, పాఠశాల పూర్వపు విద్యార్థు లైన దాసిరిపల్లి జయ చంద్రారెడ్డి, కల్పనారెడ్డి అందించారు. కార్యక్రమంలో మదనపల్లికి చెందిన డాన్స్ అకాడమీ వారు, పూర్వపు విద్యార్థులు కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రోజంతా పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థుల సందడి నెలకొంది. పాత్రికేయులకు పాఠశాల 50 వసం తాల స్వర్ణోత్సవాల కమిటీ సభ్యులు మెమొంటో అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణారెడ్డి, రామచంద్ర, అమర్నాథ్‌రెడ్డి, మంజులమ్మ, నిర్మల, లలితమ్మ, ప్రభాకర్ రెడ్డి, కోనాపల్లి జనార్దన్‌రెడ్డి, మహేష్, అబ్దుల్ రెహమాన్ మైన్‌బాషా, తోటగిరిధర్, ముజీబ్ భాష, లక్ష్మీకాంత్, మతిన్‌బాషా, మంత్రి గిరిధర్ రెడ్డి, భాస్కర్ రాము, మస్తాన్‌వల్లి, ప్రతాప్ కుమార్, ప్రభాకర్, రవీంద్రనాథ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న వేణుగోపాల్

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్మాణ పథకానికి ఎంపికైన లబ్ధిదారులు ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బీరంగి గ్రామంలో ఆకస్మికంగా పర్యటించి నిర్మాణంలో ఉన్న పలుగృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదా రులతో ఆయన మాట్లాడుతూ అర్ధాంతరంగా నిలిపివేసిన గృహ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు ఇస్తోందని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అధికారుల పనితీరుపై ఆరా తీశారు. అధికారులు లబ్ధిదారులకు అందుబాటులో ఉండి వారికి సూచనలు,సలహాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ వి.సాంబశివయ్య, ఇఇరమేష్‌రెడ్డి, డిఇ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ ఎఇ లావణ్య, అర్బన్ ఎఇ జియా ఫుజైల్ పాల్గొన్నారు.

నీతి, నిర్భీతికి నిదర్శనం నీలం సంజీవరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడు, నీతి, నిర్భీతికి నిదర్శనమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి కొనియాడారు. నీలం సంజీవ రెడ్డి 29వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ సంజీవరెడ్డి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని నాలుగేళ్లపాటు జైలు జీవితం గడిపాడన్నారు. అనేక పదవులు అలంకరించి గొప్ప పరిపాలనా దక్షుడుగా పేరు తెచ్చుకొన్నట్లు ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారని చెప్పారు. రైతు బిడ్డ రాష్ట్రపతి కాగలడని, పల్లెటూరి వాసి ఢిల్లీ నేత కాగలడని సంజీవరెడ్డి నిరూపించారని పేర్కొన్నారు. బస్సు రూట్ల విష యంలో సుప్రీం కోర్టు ప్రభుత్వానికి ప్రతికూలంగా వ్యాఖ్యలు చేసినందుకు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లో నైతిక విలువలకు పెద్దపీట వేశారన్నారు. శ్రీశైలం డ్యాం, నాగార్జున సాగర్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సంజీవరెడ్డి మానస పుత్రికలు అన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకం, స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సంజీవరెడ్డికి భారత రత్న ప్రదానం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తులసిరెడ్డి విన్నవించారు. కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గం సమన్వయ కర్త ధ్రువకుమార్ రెడ్డి, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, వెంకటేష్, మహబూబ్ బాషా, రామాంజనేయ రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, రమణ, వినయ్, బద్రి, వేమయ్య, వేమారాజా, మదార్, సాయి పాల్గొన్నారు.

మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం

పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకంలో కూటమి ప్రభు త్వం ఘోర వైఫల్యం చెందిందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించడంలో టిడిపి కూటమి, వైసిపి దొందూ దొందేనని అన్నారు. కాంగ్రెస్ పాలనలో పాఠశాల విద్యలో మూడు రకాల పాఠశాలలు ఉండేవన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా ఉండేదన్నారు. వైసిపి ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలుగా చేస్తే.. టిడిపి కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాలు చేసిందని విమర్శించారు. అందరినీ అయోమయం, గందరగోళంలో పడివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని చెప్పారు. 66,463 మంది విద్యార్థులు రీకౌంటింగ్‌కు, రీ వాల్యుయేసన్‌కు దరఖాస్తు చేసుకోగా 11,175 మంది మార్కుల్లో తేడా రావడం గమనార్హమన్నారు.

నూతన పద్ధతులు పాటిస్తే ఉత్తమ దిగుబడులు

ప్రజాశక్తి - ఖాజీపేట : ప్రస్తుతం వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు అందు బాటులోకి వచ్చాయని, వాటిని పాటిస్తే ఉత్తమ దిగుబడులు సాధిం చడంతోపాటు మంచి ఆదాయం పొందవచ్చునని శాస్త్రవేత్త బసవరాజు సూచిం చారు. ఆదివారం మండల పరిధిలోని నాగసానిపల్లె, అప్పనపల్లె రైతు సేవా కేంద్రాలలో వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మహేష్, ప్రశాంతి, మారుతి, ఎఒ నాగార్జున రైతుల కు పంటల సాగులో మెలకువలు, యాంత్రీకరణ, పంటల బీమా, పుట్ట గొడుగుల పెంపకం తదితర సాగు అంశాల గురించి వివరించారు. సాంకేతి కతను రైతులు అందిపుచ్చుకోవాలని కోరారు.

అణగారిన ప్రజల రచయిత గూగీ వా థియాంగో

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అణగారిన ప్రజల తరపున మాట్లాడిన రచయిత గూగీ వా థియాంగో అని విరసం వరలక్ష్మి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుగివా సంస్మరణ సభ ఆదివారం స్థానిక జెవివి కార్యాలయంలో నిర్వ హిం చారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు మురళి గుప్తా అధ్యక్షత వహించారు. వర లక్ష్మి మాట్లాడుతూ సమాజంలో అసమానతలపై గుగ్గి తన రచనల ద్వారా పోరాడారని, మనుషులందరూ సమానమేనని తెలిపిన రచయిత గుగి అని అన్నారు. ఆయన రచనల్లో మాటిగరి చాలా ప్రసిద్ధమైందన్నారు. ప్రశ్న చంపితే చావదని తెలిపిన రచన మాటికరి అని అన్నారు. తవ్వా సురేష్ మాట్లాడుతూ గుగి ఆఫ్రికన్ సాహిత్యంపై చెరగని ముద్ర వేశారని, ఆయన రాసిన పుస్తకాలలో మాటగరి, బందీ, మట్టి కాళ్ల మహా రాక్షసి, యుద్ధకాలంలో స్వప్నాలు, ఏడవకు బిడ్డ అనేవి తెలుగులోకి అనువాదం అయ్యాయని తెలిపారు. ఈ పుస్తకాలు తెలుగు సమాజాన్ని ప్రభావితం చేశాయన్నారు.కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం పద్మ, జెవివి ఉపాధ్యక్షుడు వేంపల్లి రాజశేఖర్, గురు, సారథి, అక్షయ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరలక్ష్మి

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - రామసముద్రం

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతీ, ఎగువనల్లప్పగారిపల్లి గ్రామానికి చెందిన తుమ్మల భాగ్యమ్మ(35)కు సుమారు 15 సంవత్సరాల క్రితం గుర్రంకొండ మండలం, లక్కవారిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు మల్లికార్జునకు ఇచ్చి వివాహం జరిపించినట్లు తెలిపారు. మృతురాలు పుట్టుకతోనే చెవిటి, సంతానం కలుగలేదని అన్నారు. వివాహమై ఎనిమిది సంవత్సరాల తరువాత భార్య భర్తల మధ్య మనస్పర్థల కారణముగా తన భర్తను వదిలేసి పుట్టింటికి వచ్చేసింది. అప్పటి నుంచి పుట్టింటిలోనే ఉంటుందని తెలిపారు. సంతానం కలుగకపోవడం, మరోపక్క భర్తకు దూరమైన కారణంగా మనోవేదనకు గురై శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆసిడ్ తాగి దొర్లుతుండగా కుటుంబీకులు గమనించి 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారని తెలిపారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందిందని తెలిపారు. మృతురాలు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.